
ప్రజాశక్తి
సోమవారం 3 మార్చి 2025
5
పార్వతీపురం మన్యం



మండుతున్న ఎండలు

41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వేసవి ఎండలు మండుతున్నాయి. నిన్న, మొన్నటి వరకు 36, 37 డిగ్రీలు ఉన్న ఉష్ణోగ్రత ఆదివారం 41 డిగ్రీలకు పెరిగింది. మార్చి ప్రారంభంలోనే ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఉదయం 9గంటల నుంచే సూర్యుడు సూర్రమంటున్నాడు. దూర ప్రాంత ప్రయాణికులు సాయంత్రం చల్లబడ్డాక రాకపోకలు సాగిస్తున్నారు. 12 గంటలు దాటితే జనసంచారం లేకపోవడంతో రోడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఉపాధిహామీ పనుల వద్ద కూలీలకు టెంట్లు, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు.

విజేత ఎవరో?

- నేడే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు
- ఉదయం 8 గంటలకే ప్రక్రియ ప్రారంభం
- ఎయు ఇంజినీరింగ్ కాలేజీ వద్ద ఏర్పాట్లు
- 'తొలి ప్రాధాన్యం' దక్కితే సాయంత్రానికే ఫలితం



సిద్ధం చేసిన కౌంటింగ్ టేబుళ్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం ఫలితం సోమవారం తేలనుంది. నరాలు తెగే ఉత్కంఠకు నేటి సాయంత్రంతో తెరపడనుంది. మండలి ఎన్నికల్లో విజేత ఎవరన్న అంశంపై ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కొద్ది రోజులుగా విపరీత చర్చ నడుస్తోంది. ఫలితం కోసం ఎదురుచూసే వారిలో ఉపాధ్యాయులే కాకుండా సాధారణ ప్రజానీకమూ ఉన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ వేదిక కానుంది. గత నెల 27న ఈ ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ జరగ్గా 20783 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారి ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది.

లెక్కింపు ప్రక్రియ ఇలా..

ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఎయు ఇంజినీరింగ్ కాలేజీ ట్రిపుల్ ఇ విభాగం భవనాల్లో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. మూడు దశల్లో సాగే లెక్కింపు ప్రక్రియ పూర్తయి విజేత పేరు ప్రకటించేందుకు 8 నుంచి 10 గంటల సమయం పడుతుందని ఎన్నికల విభాగం అధికారులు చెబుతున్నారు. లెక్కింపు ప్రక్రియలో తొలుత అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌ల సీళ్ల తొలగించి, బ్యాలెట్ బాక్సులను లెక్కించి హాల్లోకి తరలిస్తారు. 123 బ్యాలెట్ బాక్సుల లెక్కింపునకు 20 టేబుల్స్ ఏర్పాటు చేశారు. తొలిదశలో బాక్సుల్లో ఓట్లను ఆరు రౌండ్లలో వెలికితీసేందుకు కనీసం మూడు గంటల సమయం పట్టనున్నట్టు తెలుస్తోంది. రెండో దశలో పోలైన ఓట్లను 25 చొప్పున కట్టలు కడతారు. అలా వెయ్యి ఓట్లను ఒక పెద్ద డ్రమ్ములో వేస్తారు. ఈ మేరకు మరో 2 గంటల సమయం పడుతుంది. మధ్యాహ్న భోజన విరామం తర్వాత మూడో దశగా అభ్యర్థులకు పోలైన తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపును ప్రారంభిస్తారు. పోలైన ఓట్లలో చెల్లిన ఓట్లకు ఒకటి కలిపి అందులో 50 శాతం ప్లస్ 1 ఓట్లు వచ్చిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. అంటే ఉదాహరణకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలైన ఓట్లలో 20 వేలు చెల్లుబాటయితే.. వాటికి ఒక ఓటు (20,001) కలుపుతారు. అందులో 50 శాతం ప్లస్ 1 అంటే... విజేతకు 10,001 ఓట్లు రావల్సి ఉంటుంది. అలా తొలి ప్రాధాన్యత ఓట్లు 10,001 వస్తే విజేత పేరును వెంటనే ప్రకటిస్తారు.

తొలి ప్రాధాన్యతతో విజేత తేలకపోతే..

తొలి ప్రాధాన్యతా ఓట్లలో విజేత తేలకుంటే ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు లెక్కిస్తారు. అప్పుడు పోటీ చేసిన అభ్యర్థుల్లో తక్కువ ఓట్లు వచ్చిన వారి నుంచి ఎలిమినేషన్ రౌండ్ ఆరంభమవుతుంది. ఎలిమినేషన్ రౌండ్‌కు వెళ్తే పూర్తి ఫలితం వచ్చేసరికి 10 నుంచి 12 గంటల సమయం పడుతుందని, ఈ లెక్కన సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల్లోపు విజేత పేరు ప్రకటించొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

పోలింగ్ జరిగిన తీరు, బరిలో నిలిచిన వారిలో త్రిముఖ పోటీ నెలకొనడంతో మొదటి ప్రాధాన్యతా ఓట్లుతో విజేత ప్రకటన సాధ్యం కాకపోవచ్చని తెలుస్తోంది. ఏమైనా ఇబ్బందులు ఎదురైనా, ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు లెక్కించాల్సి వచ్చినా ఫలితం ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఒక వేళ తొలి ప్రాధాన్యత ఓటుతోనే విజేత ఎవరో తేలితే.. సాయంత్రం 4 గంటలకే ప్రక్రియ పూర్తవుతుంది.

ప్రధాన పోటీ ఆ ముగ్గురి మధ్యే !



కె.విజయగౌరి　　పి.రఘువర్మ　　జి.శ్రీనివాసులునాయుడు

పది మంది మండలి బరిలో ఉన్నా ప్రధానమైన పోరు యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి, బిజెపి మద్దతునిచ్చిన పిఆర్‌టియు అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు, టిడిపి, జనసేన మద్దతునిచ్చిన ఎపిటిఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ మధ్యనే నెలకొంది. పోలింగ్ జరిగిన తర్వాత వచ్చిన వార్తల ప్రకారం.. రఘువర్మను గెలిపించుకోడానికి అధికార పార్టీ నాయకులంతా ఉత్తరాంధ్ర అంతటా పలు అక్రమ పద్ధతులకు పాల్పడడం ఉపాధ్యాయుల్లో వ్యతిరేకతను పెంచేలా చేసింది. ఈ నేపథ్యంలో కొత్తగా ఎన్నికల బరిలోకి దిగిన పిడిఎఫ్ అభ్యర్థి పట్ల గురువులు మక్కువ చూపినట్టు చర్చ సాగుతోంది. గడిచిన తొమ్మిది నెలల పాలనా కాలంలో గురువుల్లో ప్రభుత్వం పట్ల అసంతృప్తి కొనసాగడం అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థి రఘువర్మకు నెగెటివ్ అయ్యిందన్న మాటలు వినిపించాయి. పిఆర్‌టియు నుంచి నిలబడి బిజెపి మద్దతు పొందిన గాదె తరుపున సొంత సంఘమే కాకుండా ఒకటీ అరా సంఘాలు పనిచేశాయని, ఈ నేపథ్యంలో ఆయనా రేసులో ఉన్నారని తెలుస్తోంది. ఏదేమైనా ఇంకొన్ని గంటల్లో విజేత ఎవరో తేలనుంది.

పకడ్బందీగా టెన్త్ పరీక్షలు

రాష్ట్ర స్థాయిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం



జిల్లాలో ఈ నెల 17నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ విద్యా శాఖాధికారులను ఆదేశించారు. శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం కావాలని, ప్రతి ఏడాది వలే ఈ ఏడాదీ రాష్ట్రస్థాయిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై డిఇఒ, ఎంఇఒలు, హెచ్‌ఎంలతో ఆదివారం కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు ఇంకా 15 రోజులే గడువు ఉన్నందున విద్యార్థులు బాగా చదువుకునేలా ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని అన్నారు. రాత్రివేళల్లో విద్యార్థులు చదువుకున్నదీ, లేనిది పరిశీలించాలని సూచించారు. పల్లె నిద్రలో కొందరు విద్యార్థులు కొన్ని సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నట్లు గమనించడం జరిగిందని, అటువంటి విద్యార్థులంతా ఆయా సబ్జెక్టులపై మంచి పట్టు సాధించేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా వారికి తగిన బోధన చేయాలని, సీ, డీ గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేకంగా బోధించాలని తెలిపారు. క్లస్టర్ రిసోర్స్ పర్సన్లతో మోడల్ పాఠాలను తయారీ చేసి, ఉత్తమ బోధన చేయాలని కలెక్టర్ హితవు పలికారు.

జిల్లాలో మార్చి 17నుంచి 31వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 10,455 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్న నేపథ్యంలో ప్రతి పరీక్షా కేంద్రంలో పక్కా ఏర్పాట్లు చేసి పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా అన్ని మౌళిక వసతులు కల్పించాలని అన్నారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా సంబంధిత అధికారులను సమన్వయం చేసుకోవాలని తెలిపారు. వేసవి దృష్ట్యా పరీక్షా కేంద్రాల్లో తాగునీరు ఏర్పాటు చేయాలని, అవసరమైన మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షను అమలు చేయాలని, ఎస్కార్ట్, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని విద్యా శాఖ అధికారులకు తెలిపారు. సమావేశంలో డిఇఒ ఎన్.తిరుపతినాయుడు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధాన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దురదృష్టవశాత్తూ గిరిజన విద్యార్థుల మరణాలు

- సంక్షేమ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలూ కల్పించాం
- జాతీయ ఎస్‌టి కమిషన్‌కు గిరిజన సంక్షేమ డైరెక్టర్ వివరణ
- ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చే యత్నం

ప్రజాశక్తి - పార్వతీపురం

'తాటి చెట్టు ఎందుకు ఎక్కావని అడిగితే దూడ మేత కోసమని చెప్పినట్టు ఉంది' గిరిజన సంక్షేమ శాఖ తీరు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలు ఎందుకు జరుగుతున్నాయి, చేపడుతున్న చర్యలు ఏమిటని జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ ప్రశ్నిస్తే గిరిజన సంక్షేమ డైరెక్టర్ ఇచ్చిన వింత వివరణపై సామెతకు సరిపోయేటట్లు ఉంది. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలూ కల్పించామని, దురదృష్టవశాత్తూ గిరిజన విద్యార్థుల మరణాలు జరుగుతున్నాయని గిరిజన సంక్షేమ డైరెక్టర్ భార్గవి జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వివరణ ఇవ్వడం చర్చనీయాంశమవుతోంది. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు అనారోగ్యంతో మరణిస్తున్నారని, నివారణకు అవసరమైన చేపట్టడంలేదని పేర్కొంటూ గిరిజన సంక్షేమ సంఘం జాతీయ ఎస్టీ కమిషన్‌కు కొద్ది నెలల క్రితం ఫిర్యాదు చేసింది. దీనిపై స్పందించిన ఎస్టీ కమిషన్ చైర్మన్ గిరిజన సంక్షేమ డైరెక్టర్‌కు నోటీసులు జారీ చేశారు. తద్వారా గిరిజన సంక్షేమ డైరెక్టర్ భార్గవి పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌కు నోటీసులు జారీచేసింది. ఈ సందర్భంలో పార్వతీపురం ఐటిడిఎ అధికారులు ఎస్టీ కమిషన్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెపుతూ వింత వివరణ ఇచ్చుకుంది. దురదృష్టవశాత్తూ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలు జరుగుతున్నాయని పేర్కొంటూ నివేదిక పంపించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహారం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలకు దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఎఎన్‌ఎంలు తరచూ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలపై జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఐటిడిఎ అధికారులు ఇచ్చిన వివరణ ఆధారంగా గిరిజన సంక్షేమ డైరెక్టర్ కూడా అదే రీతిలో నివేదించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఎఎన్‌ఎంలను నియమించాలని గిరిజన సంఘాలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలోనూ ఎఎన్‌ఎంల నియామకం జరగలేదు. ఇప్పుడున్న టిడిపి కూటమి ప్రభుత్వం కూడా ఆచరణలో అమలు చేయడం లేదు. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంల నియామకం ఫైలుపై సంతకం చేశారు. 8నెలలు దాటినా ఇంతవరకు ఎఎన్‌ఎంల నియామకానికి అతీగతీ లేదు. దీంతో ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు గిరిజన సంక్షేమ డైరెక్టర్ పంపిణీ నివేదికలో పేర్కొన్న అంశాలు చాలా వరకు వాస్తవానికి దూరంగా ఉన్నాయని గిరిజన సంఘాలు ధ్వజమెత్తుతున్నాయి.

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షల నిర్వహణ అనేది కేవలం మొక్కుబడిగా జరుగుతోందని ఆరోపిస్తున్నాయి. నిజంగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తే వారి అనారోగ్య సమస్యలు బయటకు వచ్చే అవకాశం ఉంటుందని, తద్వారా వారి ఆరోగ్య పరిరక్షణ కోసం తగిన చర్యలు తీసుకోవచ్చునని అభిప్రాయపడుతున్నారు. 8ఏళ్ల కాలంలో పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో 45 మంది విద్యార్థులు మరణించారు. వీరంతా దురదష్టవశాత్తూ మరణించారని, ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతోందని గిరిజన సంక్షేమ డైరెక్టర్ నివేదిక పంపించడం సత్యదూరంగా కనిపిస్తోందని విమర్శిస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చే యత్నంలో భాగంగా గిరిజన సంక్షేమ డైరెక్టర్ భార్గవి ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు నివేదిక పంపించినట్లు అభిప్రాయపడుతున్నారు.

ఎక్కడ పనులు అక్కడే ఆపండి!

- మంత్రిని కలిసి మాట్లాడండి
- కాంట్రాక్టర్లకు పెద్దగెడ్డ అధికారుల హుకుం
- అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు

ప్రజాశక్తి - సాలూరు

'ఎక్కడ పనులు అక్కడే ఆపేయండి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి గారిని కలిసి మాట్లాడండి, తర్వాత ఆమె చేయమంటే చేయండి, లేకపోతే వదిలేయండి' ఈ మాటలన్నది పెద్దగెడ్డ ఇంజినీరింగ్ అధికారులు. పెద్దగెడ్డ జలాశయం పరిధిలో ఉన్న కాలువల పూడికతీత పనులు చేస్తున్న కాంట్రాక్టర్లనుద్దేశించి డిఇ, ఎఇలు చెప్పిన మాటలవి. టెండర్ల ద్వారా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిర్దేశించిన పనులు కొంతవరకు చేశారు. దాదాపు 20 నుంచి 30 శాతం వరకు పనులు పూర్తి చేశారు. పనులు ప్రారంభించక ముందు పెద్ద గెడ్డ ప్రాజెక్టు అధికారులు చెప్పిఉంటే బాగుండేదని, కొంతమేరకు పనులు పూర్తి చేసిన తర్వాత చావుకబురు చల్లగా చెప్పడంపై కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. తాము చేసిన పని మేరకు బిల్లులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. స్టేట్ డిజాస్టర్ మేనేజ్మెంట్ ఫండ్ నుంచి పెద్దగెడ్డ సబ్ డివిజన్ పరిధిలో పూడికతీత పనులు చేపట్టడానికి రూ.91.21 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో పెద్దగెడ్డ ప్రాజెక్టు పరిధిలో ఉన్న కాలువల పూడికతీత పనులు, గోడలు, మదుముల నిర్మాణ పనుల కోసం టెండర్లు పిలిచారు. ఈ పనులను టెండర్ల ద్వారా దక్కించుకున్న కాంట్రాక్టర్లు యధావిధిగా పనులు ప్రారంభించారు. ప్రాజెక్టు పరిధిలో మొత్తం 15 పనులకు సంబంధించి టెండర్లు పిలువగా అన్నింటినీ అధికారుల ఆదేశాల మేరకు ప్రారంభించారు. ఈ పనులు 20శాతం నుంచి 30 శాతం వరకు పూర్తయిన తర్వాత అకస్మాత్తుగా సంబంధిత జూనియర్ ఇంజనీర్లు కాంట్రాక్టర్లకు అసలు విషయం చెప్పారు. పనులు చేస్తున్న కాంట్రాక్టర్ అంతా స్థానిక మంత్రిని కలవాలని, ఆమె చేయమంటే ఆ పనులు పూర్తి చేయాలని, లేకపోతే వదిలేయాలని జెఇలు సెలవిచ్చారు. దీంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. ఇందులో భాగంగా చెరుకుపల్లి గెడ్డ నుంచి లెప్రసీ ఆసుపత్రి వరకు కాలువ పూడికతీత పనులు, ఇతర నిర్మాణపనుల కోసం రూ.13లక్షలు మంజూరు చేశారు. పేరసాగరం నుంచి కంచికి చెరువు వరకు కాలువ పూడికతీత పనులు, ఇతర నిర్మాణ పనుల కోసం రూ.13లక్షలు మంజూరు చేశారు. ఈ పనుల్లో కాంట్రాక్టర్లు దాదాపు ఎర్త్ వర్క్ పూర్తి చేశారు. అంటే 30శాతం వరకు పనులు పూర్తి చేసిన తర్వాత పనులు ఆపేయాలని అధికారులు చెప్పడంపై కాంట్రాక్టర్ లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము చేసిన పనికి బిల్లు లు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై పెద్ద గెడ్డ ప్రాజెక్టు డిఇ శ్రీనివాసరావును వివరణ కోరగా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఆదేశాల మేరకు పనులు నిలిపివేశామని, కాంట్రాక్టర్లు ప్రజాప్రతినిధులను కలవడం ప్రజాస్వామ్యంలో సాధారణమే కదా అని చెప్పారు.



అధికారుల ఆదేశంతో నిలిచిపోయిన చెరుకుపల్లి గెడ్డ కాలువ పనులు

లైసెన్సుకో రేటు

బ్రోకర్లదే హవా

ఇదీ ఇంధన శకట కార్యాలయంలో పరిస్థితి

ప్రజాశక్తి - పాలకొండ



పాలకొండలోని ఇంధనశకట కార్యాలయం

'లైసెన్స్ కోసం ఆన్లైన్లో బుక్ చేసుకున్నాం... మాకు అన్ని అర్హతలుఉన్నాయి... లైసెన్స్ ఇప్పించరా... అంటూ రోజులు తరబడి తిరుగుతున్నా పట్టించుకునే నాధుడు లేడు. చేతులు తడిపితే ఒక క్షణంలో పని అయిపోతుంది. దీంతో చేసేదేమీ లేక ఆ కార్యాలయానికి వచ్చిన వారు అడిగింది సమర్పించుకోవడం తప్పడం లేదు. ఈ వసూలు దందా ఎక్కడో కాదు పాలకొండ డివిజన్ కేంద్రంలోని ఇంధన శకట కార్యాలయం పరిస్థితి ఎలా ఉంది. ఏదైనా లైసెన్స్ నిమిత్తం వచ్చేవారు బ్రోకర్లను ఆశ్రయించాల్సిందే. ఒక్కరే వెళ్తే అక్కడున్న సిబ్బంది విసిగించి తిరస్కరించి పంపిస్తున్నట్లు ఆరోపణ వినిపిస్తున్నాయి. దీంతో అడిగినంత పైకం ముట్టజెప్పి పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి పనికి ఒక రేటు కింద పెట్టి, బ్రోకర్ల ద్వారా లైసెన్స్ దారుల నుంచి వేలల్లో కాసులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వీరి అవినీతిపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆందోలన వ్యక్తం చేస్తున్నారు. ఎల్ఎల్ఆర్‌కు ఒక రేటు, లైసెన్సు కొకరేటు, బ్రేక్‌కు మరో రేటు, ఇలా దొరికినంత దోచుకుంటూ పనులు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముగ్గురు బ్రోకర్లతో పాటు ఆ కార్యాలయంలో కీలకంగా ఉన్న ఒక అధికారికి చెందిన డ్రైవర్ వసూళ్లకు పాల్పడుతున్నట్లు బహిరంగ ఆరోపణ వినిపిస్తున్నాయి. ఇటీవల ఒక డ్రైవరు బ్రేక్ లైసెన్స్ కావాలని వెళ్లగా అక్కడున్న సిబ్బంది డ్రైవింగ్ స్కూల్ నుంచి శిక్షణ సర్టిఫికెట్ తేవాలని ముప్పు తిప్పలు పెట్టి సుమారు రూ.4వేలు వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. అలాగే మరో వ్యక్తి లైసెన్స్ కావాలని ఆన్లైన్లో నమోదు చేసుకోగా బ్రోకర్ ద్వారా రూ.2వేలు వరకు వసూలు చేసినట్లు సమాచారం. ఇలా చెప్పుకుంటూ పోతే అవినీతి అక్రమాలకు కోకొళ్లులు జరుగుతున్నా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి పెట్టకపోవడంతో సర్వత్రారోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై 'ప్రజాశక్తి' మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలను వివరణ కోరగా అటువంటిదేమీ లేదని, తాను లేని సమయంలో ఏం జరుగుతుందో తెలియదని చెప్పారు.

గిరిజనులకు చింతే

కేజీ చింతపండు రూ.36 తగ్గిన దిగుబడి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీ ప్రాంతంలోని గిరిపుత్రులు తరతరాల నుంచి అడవినే నమ్ముకుని పోడు వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రతి ఏటా పండే ప్రధాన పంటలైన చింతపండు, జీడిపై ఎక్కువ శాతం ఆధారపడుతున్నారు. ఈ ఏడాది చింతపండు దిగుబడి అంత ఆశాజనకంగా లేకపోవడంతో తీవ్ర నిరాశలో ఉన్నారు. వచ్చిన కాస్త పంట అయినా సేకరించి కొంతమేర ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు చింతపండు సేకరణ కోసం పిల్లాపాపలతో కొండలు, గుట్టలపై ఉన్న చింత చెట్లు వద్దకు వెళ్లి ఎంతో కష్టపడి బొట్టలను ఏరి, పెంకులు తీసి అమ్మకాల కోసం కిలోమీటర్లు కాలినడకన మండల కేంద్రానికి, వారపు సంతలకు, జిసిసి ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తున్నారు. చింతపండు సేకరణలో వ్యయ ప్రయాసలు పడుతున్న గిరిజనులకు గిట్టుబాటు ధర లేక తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుంది. మరోవైపు జిసిసి నిబంధనలు గిరి పుత్రులకు ఆందోళన కలిగిస్తున్నాయి. జిసిసి కొనుగోలు కేంద్రాలకు గిరిజనులు చింతపండు అమ్మకానికి తీసుకొస్తే నాణ్యత లేదని, తడిచిన చింతపండు తీసుకొస్తే కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ఈ ఏడాది గిరిజన సహకార సంస్థ కిలో చింతపండు రూ.36 ధర నిర్ణయించింది.



చింతబొట్టలను సేకరిస్తున్న గిరిజన మహిళలు

పదివేల క్వింటాళ్ల దిగుబడి

జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియమ్మ వలస, కొమరాడ, పాచిపెంట, మక్కువ, సీతంపేట, భామిని మండలాల్లో 70 వేలకు పైగా చింత చెట్లు విస్తారంగా ఉన్నాయి. ప్రతి ఏటా పదివేల క్వింటాళ్ల వరకు చింతపండు దిగుబడి వస్తోందని అంచనా. గిరిజనులు సేకరించిన చింతపండును గిరిజన సహకార సంస్థ కొనుగోలు చేస్తుంది. అనంతరం టెండర్లు పిలిచి వర్తకుల ద్వారా మైదాన ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. జిసిసికి జిల్లాలో కోల్డ్ స్టోరేజ్ లేకపోవడంతో పంట నిల్వలను ఇతర ప్రాంతాల్లో భద్రపరచాల్సిన పరిస్థితి. జిసిసి నెలనెల టన్నులు లెక్కన అద్దె చెల్లించాల్సి వస్తోంది. ఏటా గిరిజనులు సేకరిస్తున్న చింతపండుకు టెండర్లు పిలుస్తున్నప్పటికీ జిసిసి కొనుగోలు చేస్తున్న ధర రావడం లేదు. దీంతో ఆ సంస్థ పూర్తిస్థాయిలో కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. నాణ్యత లేదని, తడిపిన చింత పండు తీసుకొస్తున్నారని రకరకాల కారణాలు చూపుతూ అంతంతమాత్రంగానే అధికారులు కొనుగోలు చేస్తున్నారని గిరిజన సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

తప్పని దళారుల బెడద

గిరిజనులు సేకరిస్తున్న చింతపండు నాణ్యత లేదని జిసిసి అధికారులు కొనుగోలు చేయకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించి తక్కువ ధరకే పంట మొత్తాన్ని అమ్ముకోవాల్సి వస్తోంది. గిరిజనుల నుంచి కొనుగోలు చేసిన చింతపండును వర్తకులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచి మంచి ధర పలికినప్పుడు విక్రయిస్తున్నారు. ఎంతో కష్టపడి గిరిజనులు చింతపండు సేకరిస్తున్నా గిట్టుబాటు ధర లేకపోవడంతో గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారు.

అన్ని రకాల ఫలసాయాలు కొనుగోలు చేయాలి



గిరిజనులు సేకరిస్తున్న చింత పండు, జీడి, కొండ చీపుర్లు, నల్లజీడి, నల్ల మామిడి వంటి తదితర అన్ని రకాల అటవీ ఫలసాయాలను జిసిసి అధికారులు కొనుగోలు చేయాలి. గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన జిసిసి, ఐటిడిఎ ద్వారా అభివృద్ధి జరగాలి. కోల్డ్ స్టోరేజ్ లు నిర్మించాలి.

మండంగి రమణ,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి.

ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలి



గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాల్లో చింతపండు, జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి గిరిజనులకు స్థానికంగా ఉపాధి కల్పించాలి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక వందలాదిమంది యువత వలస పోవాల్సి వస్తుంది. ప్రభుత్వం స్థానికంగా ఉపాధి కల్పించే మార్గాలను ఆలోచించి ప్రాసెసింగ్ యూనిట్ల ఆవశ్యకత ఎంతైనా ఉంది.జి సిసి అభివద్ధికి ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి.

కొల్లి గంగు నాయుడు
సిపిఎం జిల్లా కార్యదర్శి.



దుకాణదారుడి నుంచి పన్ను వసూలు చేస్తున్నకమిషనర్ వెంకటేశ్వరరావు

పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ పరిధిలో గల ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, కొళాయి పన్నులను సంబంధిత యజమానులు ఈనెలాఖరులోగా నేరుగా మున్సిపల్ కార్యాలయానికి గానీ, మీ వార్డు పరిధిలో గల సచివాలయాలకు గానీ చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం సెలవురోజు అయినప్పటికీ కమిషనర్, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు జి.వినయ్ కుమార్, బి.ఈశ్వరరావు, పలు సచివాలయాల సెక్రటరీలతో కలిసి పట్టణంలో పన్నుల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా యజమానులతో మాట్లాడుతూ సకాలంలో పన్నులు చెల్లిస్తేనే పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పించడంలో ముందంజలో ఉంటామని అన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ అజారి

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని బియ్యాలవలస పంచాయతీ మూలిగూడ జంక్షన్ వద్ద బిగ్ టివి, ఎస్.సొసైటీ కార్యదర్శి షేక్‌గౌస్, బియ్యాలవలస సర్పంచ్ పువ్వల అజారి సంయుక్తంగా ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరానికి కురుపాం, రేగిడి, దుడ్డుఖల్లు ఆస్పత్రి వైద్యాధికారులు శంకరావు, స్వాతి, సుకృత శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరానికి దురిబిలి, మంత్రజోల, రంగుపురం, కుశబాడీ, సేకుపాడు, గుజ్జుపాడు తదితర గిరిజన గ్రామాల నుంచి సుమారు 120 మంది రోగులు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన గిరిజన ప్రజలకు ఉచితంగా మందులు అందజేసిన బిగ్ టీవీ యాజమాన్యానికి ఎస్.సొసైటీ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరంలో బియ్యాలవలస మాజీ సర్పంచ్ పువ్వల పత్తి, వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు యువత పాల్గొన్నారు.

గిరిజనులకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కూటమి ప్రభుత్వం గిరిజనులకు ఎమ్మెల్సీ (శాసన మండలి సభ్యుని)గా అవకాశం కల్పించాలని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బ లోవరాజు కోరారు. రాష్ట్రంలో సుమారు 10 లక్షల జనాభా ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులకు రిజర్వేషన్ ప్రకారం ఎంపి, ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి అవకాశం ఉంటుంది కానీ మైదాన ప్రాంతంలో సుమారుగా 20 లక్షలు జనాభా ఉన్న గిరిజనుల కోసం ఎలాంటి పదవి లేకపోవడంతో వీరి తరపున శాసనమండలిలో సమస్యలపై ప్రస్తావన చేయడానికి అవకాశం లేకుండా పోతుందన్నారు. దీంతో వారు పడుతున్న బాధలు, సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి తెలియకుండా ఉండే పరిస్థితి నేటికీ ఉందని అన్నారు. మైదాన ప్రాంతంలో గల గిరిజనులకు అటు కలెక్టరేట్, ఇటు ఐటిడిఎ ఎటూ తెలియకపోవడం చాలా బాధాకరమన్నారు. అందుకోసం మైదానం ప్రాంతంలో గల గిరిజనులకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే వారి సమస్యలు కూడా చట్టసభల్లో ప్రస్తావన చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. సిఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్పందించి మైదాన ప్రాంతంలో గల గిరిజనులకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరారు.

పెరిగిన దోమల బెడద

ప్రజాశక్తి -భామిని

మండలంలో గత పది రోజులుగా దోమల బెడద తీవ్రమైంది. సాయంత్రమైతే చాలు దోమలు స్వైరవిహారం చేయడంతో తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. ఇది మరి కొన్ని రోజులు కొనసాగితే జ్వరాలు తప్పవని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వారానికి ఒకసారి వీధుల్లో ఫాగింగ్, బ్లీచింగ్ చేసేవారని, ప్రస్తుతం ఇవి చేయకపోవడంతో దోమలు విపరీతంగా పెరిగాపోయాయని సంఖ్య పెరిగిందని, అధికారులు స్పందించి ఫాగింగ్ చేసి, దోమల బెడద నివారణ తగ్గించాలని కోరుతున్నారు.

చదవడం మాకిష్టం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక మండల శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమంలో సరోజినీ నాయుడు జీవిత చరిత్ర విద్యార్థి చదవగా విద్యార్థిని, విద్యార్థులు ఆలకించారు. క్విజ్, పద్యాలు, గద్యాలు పోటీలతో పాటు క్యారం బోర్డు, చదరంగం, లూడో బిజినెస్ మొదలగు ఆటలు ఆడించినట్టు గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు అన్నారు. ఈ కార్యక్రమంలో 15 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురం నుంచి పెద్దబుడ్డిడి వరకు సుమారు మూడు కిలోమీటర్ల పరిధిలో బీటీ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు. ఈ గ్రామాల మధ్య రహదారి పనులు పూర్తయితే చినమేరంగి, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల పరిధిలో ఉన్న గ్రామాలకు అతి సునాయాసంగా రాకపోకలు సాగించుకోవచ్చునని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఇటీవలే స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు వినతిపత్రం కూడా అందజేశామని వారు తెలిపారు.

పల్లెపండగ పనులు పరిశీలన

ప్రజాశక్తి - మక్కువ

పల్లె పండగలో పనుల్లో భాగంగా మండలంలోని మార్కొండ పుట్టి పంచాయతీ పెదఘాశిలలో జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులను పంచాయతీరాజ్ డిఇ డి.చిన్నం నాయుడు ఆదివారం పరిశీలించారు. సుమారు రూ.12 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలన చేయడానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల ఎఇ రజిత్, ఇంజనీరింగ్‌అసిస్టెంట్లు సీత, శివతేజ పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న డిఇ చిన్నంనాయుడు

లక్షలు వ్యయం... లక్ష్యం ప్రశ్నార్థకం

ప్రారంభానికి నోచుకోని అర్బన్ హెల్త్ సెంటర్
వైద్యం కోసం ప్రజలకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రజారోగ్యం పరిరక్షణకు ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నా, వాటి వినియోగంలో నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వం లక్ష్యం ప్రశ్నార్థకంగా మారింది. ఇందుకు నిదర్శనం పట్టణంలోని మూడేళ్ల క్రితం నిర్మించి ప్రారంభానికి ఎదురు చూస్తున్న అర్బన్ హెల్త్ సెంటరే.

పట్టణంలోని 16వ వార్డు బెలగాం రైల్వే గేట్ దాటి ఉన్న జంఝావతి క్వార్టర్స్ వద్ద రూ.80 లక్షలు మున్సిపల్ నిధులతో మూడేళ్ల క్రితం పనులు ప్రారంభించిన అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం పూర్తికావచ్చినప్పటికీ, ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోకపోవడంతో ఈ భవనం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. పట్టణ ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన వైద్యాన్ని అందించేందుకు లక్షలాది రూపాయలు నిధులు వెచ్చించి ఖర్చు చేసినప్పటికీ ఈ భవనాన్ని ప్రారంభించకుండా నిరుపయోగంగా ఉంచడం పట్ల ఈ ప్రాంత ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చాకలిబెలగాం, కొత్త బెలగాం ప్రజలే కాకుండా పక్కనే ఉన్న బంగారమ్మ కాలనీ, కూతవేటు దూరంలో ఉన్న బాలగొడబ గ్రామం ప్రజలకు ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంతో ఉపయోగ పడుతుంది. రైల్వే గేటు ఉండడం వల్ల అత్యవసరమైన చికిత్స కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఈ భవనాన్ని నిర్మించి మూడేళ్లు అయినప్పటికీ నీటి సరఫరా కోసం ట్యాంకు, పైపులు ఏర్పాటు చేయక పోవడంతో నిరుపయోగంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారి చేపట్టి 9 నెలలైనా నిర్మాణం పూర్తయిన భవనాన్ని ప్రారంభించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపకపోవడం స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే విజయచంద్ర, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారులు స్పందించి ఈ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించేందుకు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.



నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని అర్బన్‌హెల్త్ కేంద్రం



విద్యార్థినిలచే కేక్ కట్ చేయిస్తున్న ఎస్ఐ సంతోషి

విద్యార్థినిలకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకుని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా సాధికార వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం జిల్లావ్యాప్తంగా కెజిబివి విద్యార్థినులకు ఆటలు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కవిటిభద్ర కెజిబివిలో రూరల్ ఎస్సై సంతోషి కుమారి ఆధ్వర్యంలో ముందుగా బాలికలకు సైబర్ క్రైమ్, ఫోక్సో, గుడ్ అండ్ బ్యాడ్ టచ్, బాల కార్మిక చట్టాలు, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనార్థాలు, ఆకతాయిల వేధింపులు, ర్యాగింగ్ నుంచి రక్షణ, సామాజిక మాధ్యమాల వినియోగం వంటి పలు మహిళా సంబంధిత నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థినిలకు మ్యూజికల్ చైర్స్, పరుగు పందెం, పాటల పోటీలు, ముగ్గుల పోటీలు, కబడ్డీ, వాలీ బాల్, ఖోఖో, క్యారం బోర్డు, నృత్య పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా విద్యార్థినులకు పోలీసులు లేదా పోలీస్ స్టేషన్లపై ఉన్న అభద్రతాభావం తొలగిపోయి, వారికి ఏమైనా సమస్యలుంటే ఆ సమస్యలను స్నేహపూర్వక వాతావరణంలో పోలీసు అధికారులకు సులభంగా తెలియజేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. తద్వారా వారి భద్రతకు మరింత మెరుగైన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని పోలీసులు తెలియజేశారు.

ప్రశాంతంగా ఏకలవ్య ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరి పిటిజి, గుమ్మలక్ష్మీపురం ఇఎంఆర్ఎస్ కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ఏకలవ్య పాఠశాల ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పిటిజి పరీక్ష కేంద్రంలో ఏకలవ్య పాఠశాల ప్రవేశ పరీక్షకు 136 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 128 మంది పరీక్ష రాశారు. 8మంది గైరాజరయ్యారు. ఇఎంఆర్ఎస్ కేంద్రంలో 394 మంది విద్యార్థులకు 382 మంది హాజరు కాగా 12మంది గైర్హాజరైనట్లు ఎటిడబ్ల్యూఒ సురేష్ కుమార్ తెలిపారు.

సీతానగరం : మండలంలోని జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్సలన్సీ స్కూల్ ఆఫ్ యాక్సిడెంట గురుకుల పాఠశాలలో ఏకలవ్య మోడరన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహించారు. 227 మంది విద్యార్థులకు గానూ 209మంది పరీక్ష రాశారు. ఈ పరీక్షకు డిపార్ట్మెంట్ ఆఫీసర్‌గా గణపతి నాయుడు, అబ్జర్వర్‌గా ఏకలవ్య పాఠశాల కురుపాం ప్రిన్సిపల్ యోగేంద్ర బహుదూర్, చీఫ్ సూపరింటెండెంట్‌గా ధర్మరాజు, ఐటిడి అబ్జర్వర్‌గా చంద్రబాబు హాజరయ్యారు.




గుమ్మలక్ష్మీపురంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సీతంపేట : బాలికల గురుకుల పాఠశాలలో ఏకలవ్యలో ఆరో తరగతి ప్రవేశానికి ప్రవేశ పరీక్ష ఆదివారం గురుకుల పాఠశాలను నిర్వహించారు. 331 మంది విద్యార్థులకు గానూ 313 హాజరైనట్లు డిఒ నీలం నాయుడు తెలిపారు. ఈ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్ అరుణ్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

పగలే వెలుగులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని కస్పా, అక్కులపేట తదితర వీధుల్లో విద్యుత్ దీపాలు సూర్యునితో పోటీపడి వెలుగులు వెదజల్లుతున్నాయి. వృథాగా విద్యుత్తును వాడకూడదని, పొదుపు చేయాలని అధికారులు పదేపదే ప్రకటనలు గుప్పిస్తున్నప్పటికీ ఇక్కడ అధికారుల నిర్లక్ష్యం వల్ల రాత్రి సమయంలో వెలగాల్సిన దీపాలు పగలు వెలుగుతుండడంతో స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ వృథా కాకుకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కస్పా వీధులో వెలుగుతున్న వీధిదీపాలు



సీతానగరం జెడ్‌పి హైస్కూల్‌కు పూర్వవిద్యార్థులు అందజేసిన టేబుళ్లు

పాఠశాలకు బెంచీలు వితరణ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1999 విద్యాసంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వవిద్యార్థులు తరగతి గదుల్లో పాఠ్యాంశ బోధనకు వీలుగా రూ.25వేలు విలువ చేసే టేబుళ్లను వితరణగా అందజేశారు. ఇదే బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి సూర రవికుమార్ ఫర్నీచర్ సదుపాయం కల్పించారు. భవిష్యత్తులో పాఠశాలకు మరింత సహాయసహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు రవికుమార్‌ను, పూర్వ విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ పలగర శ్రీదేవి అభినందించారు.

జీడిపిక్కల ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజనులకు ఎంతో ఉపయోగకరమైన జీడిపిక్కల ప్రాసెసింగ్ సెంటర్‌ను మండలంలో ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు కె.సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీడి పిక్క బతుకు పక్కా అన్న భరోసాతో గిరిజన రైతులు సుమారు 60వేల ఎకరాల్లో జీడి సాగు చేస్తున్నారన్నారు. జిల్లాలో జీడి పిక్కల ప్రాసెసింగ్ సెంటర్లు లేకపోవడంతో రైతులు జీడి పిక్కలను అతి తక్కువ రేటుకు దళారీలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో వన్ దన్ కేంద్రాల ద్వారా జీడిపిక్కలు, చింతపండు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తామని అధికారులు చెప్పినా కొన్ని మండలాల్లో తూతూ మంత్రంగానూ, పూర్తిగా మరికొన్ని మండలాల్లో పూర్తిగా కొనుగోలు చేయని పరిస్థితి ఉందన్నారు. అలాగే వీటి కోసం యంత్రాలు కొనుగోలు చేశామని చెప్పినప్పటికీ ఆ యంత్రాలు నిరుపయోగంగా ఉండడంతో పాటు ఏ మండలాల్లో ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సీజన్‌కైనా జీడిపిక్కలు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ప్రోసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు.

విరగబూసిన మామిడిపూత



ఆశాజనకంగా జీడి, మామిడి పూత

ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

ప్రజాశక్తి - కురుపాం

జీడి, మామిడి పూత ఆశాజనకంగా ఉండడంతో గిరి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గిరిజన పంచాయతీల పరిధిలో జీడి, మామిడి తోటలు అధికంగా ఉన్నాయి. గతేడాది డిసెంబర్ వరకు వర్షాలు కురవడంతో మామిడి, జీడి తోటల పూత బాగుంది. దీనికి తోడు ఈ ఏడాది మామిడి, జీడి మామిడి పూత దశలో పెద్దగా పొగ మంచు కురవకపోవడంతో పంట దిగుబడి అధికంగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు. గతేడాది మామిడి, జీడి తోటలు పూత సమయంలో పొగ మంచు అధికంగా కురవడంతో పూత మగ్గిపోయి ఆశించిన స్థాయిలో దిగుబడులు రాలేదు. దీనికి తోడు గతేడాది తుపాన్ల బీభత్సానికి ఇతర పంటలు దెబ్బతిన్నాయి. పెట్టిన పెట్టుబడులు కూడా రాక గిరిజనులు తీవ్ర నష్టాన్ని చవిచూశారు. జరిగిన పంట నష్టానికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆర్థిక సాయం అందించకపోవడంతో గిరిజన రైతుల జీవనం కష్టతరంగా మారింది. అయితే ఈ ఏడాది జీడి, మామిడి ఆశాజనకంగా దిగుబడులు వస్తే ఆర్థికంగా కుటుంబ పోషణకు దోహదపడుతుందని గిరిజన రైతులు ఆశిస్తున్నారు.

ఎంపిటిసిని పరామర్శించిన రాజన్నదొర

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ఎర్రసామంతవలసకు చెందిన పనసభద్ర ఎంపిటిసి సభ్యుడు సామంతుల వెంకట్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద చికిత్స పొందుతూ ఉన్న విషయాన్ని తెలుసుకొని ఆయన్ను ఆదివారం మాజీ డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకట్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసనాయుడు, మండల వైసిపి అధ్యక్షులు రంగునాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపిటిసిని పరామర్శించిన పుష్ప శ్రీవాణి, పరీక్షిత్ రాజ్

కురుపాం : స్థానిక ఎంపిటిసి టివిఎస్ స్వామియోజులు కుమారుడు శనివారం అరుకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన తెలుసుకున్న మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్ప శ్రీవాణి, మన్యం జిల్లా వైసీపీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు ఆదివారం కురుపాంలో స్వామియోజులు ఇంటికి వెళ్లి పరామర్శించి ఓదార్చారు. అన్ని విధాలా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు ధైర్యాన్నిచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి. సుజాత, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపిటిసి సభ్యులు జి. సంతోషిని, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అనారోగ్యంతో బాధపడుతున్న ఎంపిటిసిని పరామర్శిస్తున్న రాజన్నదొర



ఎంపిటిసి కుటుంబీకులను పరామర్శిస్తున్న పరీక్షిత్‌రాజు దంపతులు

వాకాడను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

సీతానగరం : వైసిపి సీనియర్ నాయకులు, జెడ్పీ మాజీ ఛైర్మన్ వాకాడ నాగేశ్వరరావును మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, వైసిపి సీనియర్ నాయకులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ఆదివారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై విశాఖ ఆస్పత్రిలో నాగేశ్వరరావు చికిత్స పొందారు. ఆయన ఆరోగ్యం కుదుటపడడంతో ఇటీవల స్వగ్రామమైన బూర్జకు వచ్చారు. దీంతో మాజీ ఎమ్మెల్యే జోగారావు నాగేశ్వరరావు నివాసానికి వెళ్లి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములునాయుడు, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు ఆర్వీ, స్థానిక సర్పంచ్ గుజ్జల దాసు, సీనియర్ నాయకులు పోల బలరాం నాయుడు తదితరులు ఉన్నారు.

కాలువల నిర్వహణ గాలికి

కదలని మురుగునీరు

పర్యవేక్షణ లేని శానిటరీ సెక్రటరీలు, ప్రజారోగ్య అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని పలు వీధుల్లో గల కాలువల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్థంగా ఉంది. వార్డుల్లో ప్రతిరోజూ ఇంటింటి నుంచి చెత్తసేకరిస్తున్నప్పటికీ పట్టణ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువలతో పాటు, 30 వార్డుల్లో గల కాలువల నిర్వహణ మున్సిపల్ ప్రజారోగ్యశాఖ అధికారులు, మున్సిపల్ పరిధిలో గల 15 సచివాలయాల శానిటరీ సెక్రటరీలు గాలికి వదిలేయడంతో ఎక్కడికక్కడ కాలువలు చెత్తలు, వ్యర్థాలతో మూసుకుపోయాయి. మురుగునీరు బయటకు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోతుంది. దీనికి తోడు పలు షాపుల్లో విక్రయించే వాటర్ బాటిళ్లు, కొబ్బరి బొండాలు, మద్యం సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు, తదితర వ్యర్థాలను కాలువల్లో పడవేస్తున్నారు. దీంతో కాలువల్లో కుప్పలు, కుప్పలుగా వ్యర్థాలు పేరుకుపోతున్నా పర్యవేక్షణ జరగడం లేదు. ఈ వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు తొలగించే క్రమంలో కాలువలపై ఉన్న ఆక్రమణల వల్ల వాటిని తొలగించేందుకు పారిశుధ్య నిర్వహణ కష్టతరంగా మారుతోంది. ఈ పరిస్థితిపై దృష్టి పెట్టాల్సిన అవసరం పాలకవర్గంతో పాటు కొత్తగా వచ్చిన కమిషనర్, ప్రజారోగ్య విభాగ అధికారులు, శానిటరీ సెక్రటరీలపై ఎంతైనా ఉంది.ఇప్పటికైనా అధికారులు స్పందించి



సిరేల వీధిలో కాలువల పరిస్థితి.



సిరిపాదనవీధిలోని రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ఇదేం పారిశుధ్యం?

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలోని సిరిపాదన వీధిలో రోడ్డుపైనే మరుగునీరు ప్రవహిస్తుంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కనీసం నడవడానికి కూడా వీలులేకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి చెందుతున్నారు. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారి స్పందించి స్థానికులు కోరుతున్నారు.

మందుబాబులకు ఆవాసంగా రైతు సేవా కేంద్రం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు మందుబాబులకు ఆవాసాలుగా మారాయి. స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో గల రైతు సేవా కేంద్రం ఆవరణమంతా ఖాళీ మద్యం బాటిల్లు, వాటర్ ప్యాకెట్లు, గ్లాసులు దర్శనమిస్తున్నాయి. ప్రతిరోజు రాత్రి సమయంలో పేకాట, అసాంఘిక కార్యక్రమాలు, వ్యభిచారాలు కూడా ఈ పరిసర ప్రాంతాల్లో జోరుగా సాగుతున్నట్లు స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది రైతు సేవా కేంద్రంమా? మద్యం దుకాణమా అనిస్థానికులు చర్చించుకుంటున్నారు. వీటి నివారణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించకపోతే మరెన్నో అఘయిత్యాలు జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై ఎఒ జె.సౌజన్య ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రైతు సేవా కేంద్రం ఆవరణలో పేరుకుపోయిన మద్యం బాటిళ్లు